# నామముచేత నామిని పొందవచ్చు!

**పాపభయంబు పోయె పరిపాటైపోయెను దుష్కృతంబిలన్**
**శ్రీపతి భక్తిపోయె వివరింపగలేని దురంత కృత్యముల్**
**దాపురమయ్యె లోకమున తాపసలోక శరణ్యుడైన ఆ**
**శ్రీపతి నామచింతనయె చేకూరచేయు సుఖంబు మానవా!**

ప్రేమస్వరూపులారా!

రత్నముయొక్క మూల్యమును గుర్తించినప్పుడే దానిని మనము భద్రముగా కాపాడుకొనుటకు తగిన ప్రయత్నము చేస్తాము. అదే విధముగా దైవ నామముయొక్క విలువ గుర్తించుకున్నప్పుడే దానికి తగిన శ్రద్ధాభక్తులను తగిన స్థానమునందు చేర్చుకుంటాము. సర్వాభీష్టములను ప్రసాదించే దైవమును మనము తగిన స్థానమునందు భద్రపరచుకున్నప్పుడే మానవాభీష్టములు నెరవేర్చుకొని దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన దైవత్వమును అనుభవించుటకు అవకాశము వుంటుంటాది. కామధేనువునైనా మెడకు త్రాడుకట్టి గూటమునకు కట్టివేసినప్పుడే అది మన స్వాధీనములో వుంటుంది. సర్వాభీష్టములను అనుగ్రహించే దైవముకూడను కామధేనువు స్వరూపమే! అట్టి దైవమును నామమనే ఒక త్రాడుతో నాలుక అనే గూటమునకు కట్టివేసినప్పుడే దైవము మనయొక్క స్వాధీనమునందు వుంటాడు. నామములందు రెండు విధములైన నామములు కలవు. దీనిని అనేక విధములుగా కీర్తిస్తుంటారు, భక్తులు.

## అన్నీ సంకీర్తనలకంటె నామసంకీర్తన చాలా ఉత్తమమైనది

దీనినే కీర్తనమని, సంకీర్తనమని రెండు విధములు. కీర్తన అనగా కీర్తించే సాధకుని మాత్రమే తరింప చేస్తుంది. సంకీర్తన అనగా లోకము ననుగ్రహిస్తుంది. ఈ కీర్తనయందు

sri sathyasai vachanamrutam

గుణకీర్తన మొదటిది. భగవంతుని గుణగణములను వర్ణించటము, కీర్తించటము. రెండవది భావకీర్తన. అనగా శాంత భావముచేతను, సఖ్య భావముచేతను, అనురాగ భావముచేతను, వాత్సల్య భావముచేతను, మధుర భావముచేతను భగవంతుని కీర్తించటము. మూడవది లీలా సంకీర్తనము అనగా భగవంతునియొక్క లీలలను, క్రీడలను వర్ణించుకుంటూపోవటం. రాసక్రీడలను కూడను వర్ణించటము వుంటుండాది. నాల్గవది, నామ సంకీర్తనము. ఈ అన్నింటికంటె నామసంకీర్తనము చాలా ఉత్తమమైనది. అయితే మనము గుణసంకీర్తన, భావసంకీర్తన, లీలాసంకీర్తన, నామసంకీర్తన ఈ అన్నింటిచేత నిత్యము ఆనందమును అనుభవిస్తున్నాము. నామము అనగా న-అ-మ అనే మూడు అక్షరములచేత ఏర్పడుతున్నాది.

ఈ సంకీర్తనము సప్తస్వరములతోకూడినది. సంఖ్యాశాస్త్రమునుబట్టి విచారించగా న-అ-మ. 'న' అనగా జీరో, ఏమీలేనిది. 'అ' దీనికి రెండు సంఖ్య. 'మ' దీనికి ఐదు సంఖ్య. కనుక 0+2+5=7 అవుతుంది. 'స,రి, గ, మ, ప, ద, ని' అనే సప్త స్వరములతో కూర్చుతూ వచ్చారు. ఆనాటి రాసక్రీడలయందు యీ సరిగమపదని ల తత్త్వము యిముడ్చుకొని, దానికి భావరాగతాళములను చేర్చుకొని కీర్తించుచూవచ్చారు. యీ సప్తస్వరములను తమయందు లీనము గావించుకొని రాగతాళభావ సంకీర్తనలచేత తన్మయత్వులై, మత్తులై, ఉన్మత్తులై గోపికలు దైవముతో చేరిన సన్నివేశమది. వారు ప్రప్రథమములో భగవంతుని ప్రార్థించినది:

> **రార వేణుగోపబాల రాజిత సద్గుణ గుణశీలా నందగోపాలా**
> **నీవెందు రావేలా నేనెందు పోజాల మదిలో ముదమలర**
> **మా ఎదురుగ నిలువర ॥రార॥**

తిరిగి దీనికి స్వరములు వేస్తూ

> **సరిగమ పదనిస.....సదపమగరిస రిసదని సస**

యీ విధముగా స్వరబద్ధమైన రాగముచేతను, తాళముచేతను కీర్తింపబడినది కనుక దీనికి సంకీర్తన అని యీ సంకీర్తనద్వారా జగత్తంతకూడను కళ్యాణమయమైపోయి జగత్తునకే



sri sathyasai vachanamrutam

క్షేమము చేకూర్చేదిగా గోపికలు నిరూపిస్తూ వచ్చారు.

ఇదే విధముగనే రామనామముకూడను సప్తస్వరములచేత యేర్పడినదనే సత్యాన్ని జగత్తునకు ప్రకటిస్తూ వచ్చారు. ఇక్కడ ర, అ, మ అనే మూడు అక్షరములున్నాయి. ఈ 'ర' అనేది 'తత్' తత్త్వములో చేరింది. 'మ' అనేది 'త్వమ్' అనే తత్త్వముతోకూడినది. ఈ 'ర' అనేది రెండు సంఖ్య. 'మ' అనే అక్షరముయొక్క సంఖ్య, ఐదు. ఇదికూడను ఏడు సంఖ్యకు సరిపోలినది. కనుకనే సప్త స్వరములు, సప్త ద్వీపములు, సప్త సముద్రములు, సప్త వర్ణములు. దీనిని పురస్కరించుకొనియే సప్తాహములు చేస్తూ వచ్చారు, ప్రజలు. సప్తఋషులుకూడను యీ సప్త స్వరములయందే లీనమై వున్నారు. లోకమునకు ఆధారభూతమై వున్నది, అగ్ని, సూర్య, చంద్రులు. ఈ మూడుకూడను మూడు విధములైన బీజాక్షరములతోకూడినవి. అగ్నికి బీజాక్షరము 'ర'; సూర్యునికి బీజాక్షరము 'అ'; చంద్రుని బీజాక్షరము 'మ'; కనుక, యీ 'ర, అ, మ' అనేవి కేవలము అగ్ని, సూర్యచంద్రులయొక్క స్వరూపమే! ఎట్టి నాస్తికుడైనా, యాస్తికుడైనా, ఆస్తికుడైనా, ఆస్తికనాస్తికుడైనా అగ్ని, సూర్య చంద్రులు లేరని వాదించుటకు వీలులేదు. వారి వాదమునే మనము ఆధారము చేసుకొని విచారించినప్పుడు మానవుని సంయోగముచేతనే సృష్టి యేర్పడుతున్నదని వారి వాదము. మానవునియొక్క సంయోగము లేక సృష్టి జరుగుటలేదు. దీనికి ప్రత్యేకముగా భగవంతుడు అవసరంలేదు అని, వారి వాదము. మంచిదే! దీనినికూడను అంగీకరించవలసినదే! అయితే, యీ అగ్నికి తల్లితండ్రులెవరు? అగ్నిని సమీపించినంతనే మనము దహించుకొని పోతుండగా యిలాంటి అగ్నికంటె అనంతమైన శక్తికల్గినవారే యీ అగ్నికి తల్లితండ్రులుగా వుండాలికదా? ఎన్నో కోట్లమైళ్ల దూరములోనున్న సూర్యుని చూచినంతనే మన మెన్నో విధముల తాపముతో బాధపడుతున్నాము. ఇలాంటి ప్రకాశముతోకూడిన సూర్యుని తల్లితండ్రులు యింకెంత ప్రకాశవంతమైవుండాలి. రెండు లక్షల నలభై ఎనిమిదివేల మైళ్ల దూరములో వున్న యీ చంద్రునియొక్క చల్లదనమును, ఆనందమును, హాయిని యింత దూరములో వున్నప్పుడే మనము అనుభవిస్తున్నాము. ఇట్టి చంద్రునికికూడను తల్లితండ్రులు వుండాలి కదా! వీరు మరింత చల్లదనం ప్రసాదించగలవారుగా వుండాలి కదా! కనుక అగ్నికంటె ప్రకాశవంతమైన, సూర్యునికంటె దేదీప్యమానమైన తేజస్సు



sri sathyasai vacHanamrutam

గల్గినవారు, చంద్రునికంటె అతి చల్లదనం కల్గినవారు ఎవరో వుండి వుంటారు, వారెవరు? అతనే భగవంతుడు.

### భగవన్నామముచేత విషముకూడను అమృతముగా మారిపోతుంది

నిత్యనిర్మలనిస్వార్థమైన దైవత్వాన్ని గుర్తించటానికి, నిత్యసత్యనిర్మల తత్వమైన ఆనంద తత్త్వాన్ని విచారించటానికి మానవత్వంలో అంత తెలివితేటలు అభివృద్ధి గావటంలేదు. నామతత్త్వము చాలా పవిత్రమైనది. చాలా దివ్యమైనది. రామనామముచేత లేక భగవన్నామముచేత విషముకూడను అమృతముగా మారిపోతుంది. దీనికి ప్రత్యక్షసాక్షి మీరా! విషమయమైన పాలు త్రాగుతూ 'కృష్ణా!' అని నామము స్మరించింది. అంతే, ఆ పాలు అమృతమయముగా మారిపోయాయి. దైవనామముయొక్క పవిత్రతను, శక్తి సామర్థ్యములను అందరూ గుర్తించలేరు. యిట్టి నామతత్త్వాన్ని మనం గుర్తించటానికి తగిన విచారణ చేయాలి. ఇది యే విధంగా చేయాలంటే త్రికరణ శుద్ధితో గావించాలి. మాటతో ఉచ్చరించే నామమును మనసుతో చింతించాలి. మనస్సుతో చింతించి మాటతో ఉచ్చరించే నామమునకు లయబద్ధముగా తాళము వేయాలి. అదే త్రికరణ శుద్ధి. త్రికరణ శుద్ధి అనగా మనస్సు, వాక్కు, కాయము యీ మూడింటి ఏకత్వమే! భగవన్నామమును ఉచ్చరించే సమయములో ఏదో కేవలము రాగతాళ భావములను మాత్రమే మనము గుర్తించక మన హృదయమునందు పవిత్రమైన భగవంతుని దివ్య తత్త్వాన్నికూడను చక్కగా విచారించాలి. చిత్తశుద్ధియే లేకుండిన నామసంకీర్తనలోని మాధుర్యమును మనము అనుభవించలేము. ఎటువంటి గాయకుడైనప్పటికిని, నారద తుంబురాదులైనప్పటికిని, భావశుద్ధిలేక యీ గానము కళగా మారదు. ఇందులో మాధుర్యము యేర్పడదు. కనుకనే, యీ భావరాగ తాళములనేవి మానసికముగాను వాక్కుతోను చేర్చి ఉచ్చరించినప్పుడే యిది మధురమైన ఆనందాన్ని అందిస్తుంది. కేవలము మాధుర్యము నందించటమే కాదు, మానవత్వాన్ని దైవత్వంగాకూడను మార్చకలుగుతుంది. మానవుడనగా నమ్మకము గలవాడు అని అర్థము. ఈ నమ్మకమును మనము ఏ రీతిగా బలపరచుకోవచ్చును? నమ్మిన దానిని ఆచరణలో పెట్టినప్పుడే యీ నమ్మకము బలపడిపోతుంది. ఎంత ఆచరణలో పెడతామో అంతగా

srisathyasaivachanamrutam

నమ్మకము అభివృద్ధి అవుతుంది.

**ఆత్మవిశ్వాసము లేనివారికి అన్నీ సందేహములే!**

జీవితము చాలా విలువైనది. చాలా పవిత్రమైనది. జీవించతగినది. దీనికొక లక్ష్యము వుందని మనము నమ్మాలి. ఈ నమ్మకమే లేకుండిన ఆత్మవిశ్వాసమే మనకు కుదరదు. ఆత్మవిశ్వాసము లేనివారికి అన్నీ సందేహములే! ఈ సందేహములున్నవారికి యేమాత్రం శాంతి కలుగదు. శాంతిలేని జీవితము జగత్తులో వ్యర్థము. తనను తాను నమ్మక, దైవమును నమ్మలేనివాని జీవితము వ్యర్థమనే చెప్పవచ్చును. దైవముపైన, తనపైన గాఢమైన విశ్వాసము కలవాడే, పవిత్రమైన జీవితమును అనుభవించగలడు. Faith in ourselves, faith in GOD; this is the secret of greatness. యిలాంటి తత్త్వాన్ని మనము మొట్టమొదట గుర్తించాలి.

**గుణ, లీలా, భావ సంకీర్తనలకంటె నామసంకీర్తన చేస్తే భగవంతునియందు లీనమై పోవచ్చును**

నామంచేత నామిని మనం పొందవచ్చు. ఈ జగతత్తంతయూకూడను రూపనామములచేతనే కూడివుంది. ఈ జగత్తులో రూప, నామములు లేని ఏ పదార్థము, ఏ వ్యక్తి వుండుటకు వీలుకాదు. కనుక, యీ నామమునాధారం చేసుకున్న రూపము ఏ ప్రదేశమునందున్నప్పటికీ మనము వశము చేసుకోవచ్చును. కేవలము భగవంతుని గుణగణములు వర్ణించుటకంటె, లీలలు గానము చేయుటకంటె, అతనియొక్క తత్త్వములను అతనియొక్క భావములను కీర్తించుటకంటె, అతని నామమునే మనము ఉచ్చరించటము అత్యంత పవిత్రమైనది. 'దయామయా', అని వర్ణించినప్పుడు దయామయులెంతమందో వుండవచ్చును, లోకములో. 'లీలామానుష విగ్రహుడు' అంటుంటే లీలామానుష విగ్రహు లెంతమందో వుండవచ్చును, లోకములో. భగవంతుని లీలలనుగానీ, గుణములనుగాని, చేష్టలనుగాని వర్ణించటంచేత కేవలము తాత్కాలికమైన మానసికానందమును అందుకోవచ్చునేగాని, సాక్షాత్ భగవంతుని నామాన్నే ఉచ్చరించటముచేత అతనియందే మనము లీనమైపోవచ్చును.



sri sathyasai vahini vachanamrutam

**నామసంకీర్తనయందు జీవితముగడిపినవాడు నామిగా మారగలడు**

కీర్తనముకంటె, సంకీర్తనయందు పాల్గొనటము చాలా మంచిది. మనము ఏకాంతములో కూర్చుని దైవాన్ని కీర్తించి ఏదో మనకు మనము ఆనందాన్ని అనుభవించవచ్చును. అయితే, సామాజిక ప్రార్థనలలో మనము పాల్గొని ఆనందించాలి, అభివృద్ధి గావించాలి. ప్రప్రథమములో సామాజిక సంకీర్తనను ప్రారంభించిన వారు, గురునానక్. సామాజిక సంకీర్తనచేత మానవులందరు తరించవచ్చని ఆయన విశ్వసిస్తూవచ్చాడు. 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ' అన్నట్లు, అందరియందు ఉండిన ఒకే భగవంతుని నామమును సామూహికంగా ఒక్క పర్యాయం ఉచ్చరించినప్పుడు దైవత్వమనే ప్రకాశము అందరియందు వెలుగుతుంది. 'బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి', అన్నారు. అనగా బ్రహ్మతత్త్వాన్ని గుర్తించినవాడు, బ్రహ్మయే కాగలడు. అదే విధముగా నిరంతరం నామసంకీర్తనముచేత జీవితం గడపినవాడు నామిగా మారగలడు.

**శాశ్వతమైన, నిత్యమైన, సత్యమైన, దివ్యమైన ఆనందము చేకూర్చేది, నామము**

మహాదుష్టుడైన, దుర్మార్గుడైన రత్నాకరుడుకూడను వల్మీకములో కూర్చుని రామ, రామ, రామ అని రామనామమే చింతించటంచేత రామునియొక్క తేజస్సు వాల్మీకి ముఖములో ప్రతిబింబించింది. రామ కరుణా తేజమంతాకూడను వాల్మీకి ముఖమునందే ఆవిర్భవించింది. వాల్మీకి తేజోమయస్వరూపుడుగా ప్రకాశించాడు. ఆ ప్రకాశమునందే రామాయణము ఉద్భవించింది. నిరంతరము భగవత్ చింతన చేసుకొనే మోజస్‌నందుకూడను భగవత్తేజము పుట్టిపడింది. రాక్షస వంశములో పుద్భవించిన ప్రహ్లాదుడు నిరంతరము 'నారాయణ, నారాయణ' అని నారాయణ చింతన చేయడంచేతనే అతని రూపము తేజోమయముగా మారిపోయింది. నామచింతన అనేది కేవలము తాత్కాలిక ఆనందమును అందించునది మాత్రమే కాదు. శాశ్వతమైన, నిత్యమైన, సత్యమైన దివ్యమైన ఆనందము చేకూర్చేది నామము. దీనిని తాత్కాలికముగా మనము emotion అని చెప్పవచ్చును. excitement అని చెప్పవచ్చును. కాని అవి సరైన పదములు కావు. అయితే, నామసంకీర్తనను సామాజిక సంకీర్తనగా చేయునప్పుడు మనము సమాజముపై దృష్టిని

sri sathyasai vahini amrutam

నిలుపుకోవాలి. అందరూ కూడా దీనిని అనుసరించే సులభమార్గములో వుండాలి. ఏదో నీ శృతిని, నీయొక్క రాగమును, నీయొక్క భావమును మాత్రమే నీవు స్వార్థముగా అనుభవించటము మంచిదికాదు. అనేకమంది కూడినప్పుడు అందరుకూడను దీనిని వుచ్చరించటానికి సులభమైన మార్గములో మనము ఆ యొక్క నామమును పలకాలి.

## సామూహిక భజనలయందు సర్దుబాటు చేసుకోవలసిన ఎన్నో విషయాలున్నాయి

ఇతరులు అనుసరించలేని పాటలు నీవు పాడుతూ వస్తే, యితరులు ఎవ్వరు అందుకోలేని నామమును నీవు వుచ్చరిస్తే, యిది కేవలము చప్పిడిగా వుంటుంది. ఉత్సాహము, ఉల్లాసము అందులో ఆవిర్భవించదు. ఇతరులు దీనిని అనుసరించలేని స్థితియందు వారి మనసులు అనేకరకములుగా చెదరిపోతూ వుంటాయి. అలాంటి అవకాశమును మనము అందించరాదు. అందరు యేకోన్ముఖులై ఒక్కతూరి నామము చేసినప్పుడు ఎంతదివ్యమైన ఆనందము మనలో ఆవిర్భవిస్తుంది! ఎంత చైతన్యము మనలో ఉద్భవిస్తుంది! చాలామందికి యీ సమావేశములలోపల వేలాది ప్రజలుకూడినప్పుడు ఎలాంటి నామము చెప్పాలి, ఎలాంటి కీర్తన చేయాలి అనేది యేమాత్రము తెలియదు. తనకు నచ్చిన దానిని మాత్రమే తాను చెప్పగలడు గాని పరులకు నచ్చిన దానిని తాను చెప్పలేడు. తనకు నచ్చినట్లుగా తాను గానం చేసుకోవాలంటే ఏకాంతముగా రూములో గానం చేసుకోవచ్చును. కాని, సమావేశములో మాత్రం సరైన రీతిగా యితరులకు అందించి తాను అందుకొని ఆనందించే నామాన్ని మాత్రమే వుపయోగపెట్టాలి. సామాజిక భజనలయందు అనేక విధములుగా కొన్ని మనము సర్దుకోవలసినవి వున్నాయి.

## నామసంకీర్తనద్వారా వాతావరణము పవిత్రమవుతుంది

కీర్తన గావించే సమయములోపల మనము ఆలాపనలు అధికముగా చేయవచ్చును. కాని, సామాజిక భజనలయందు యీ ఆలాపనలు యేమాత్రం పనికిరావు. కనుక, కీర్తనను సంకీర్తనగా మార్చుకోవాలని అనుకున్నప్పుడు కేవలము ఒక్క నామము మాత్రమే మనకు అక్కడ వినిపించాలి. ఈనాడు ప్రపంచమంతటా 'నామసంకీర్తన', 'అఖండ భజన', అని పెట్టుకున్నారు. ఇది ఒక వ్యక్తి నిమత్తమై యేర్పడినదికాదు. ఇది ఒక్క దేశమునకు మాత్రమే

sri sathyasai vachanamrutam

సంబంధించినది కాదు. ఇది కేవలము ఒక సమాజమునకు మాత్రమే సంబంధించినది కాదు. యావత్ప్రపంచమునకు సంబంధించినది. మనము గావించే ప్రతిశబ్దముకూడను విద్యుత్ తరంగములలో లీనమైపోతుంది. యీ విద్యుత్ తరంగములు సర్వత్రా వ్యాపించిపోతున్నాయి. ప్రపంచమంతా యిది ఆవరిస్తుంది. తద్వారా వాతావరణం పవిత్రమై పోతుంది. ఆ వాతావరణమునే మనంకూడా ఆస్వాదించటంచేత మన హృదయంకూడను నిర్మలమై పోతుంది. నామసంకీర్తన, యిచ్చిపుచ్చుకునే ఆత్మసంబంధము, అన్యోన్య ఆశ్రయమైనదిగా వుండాలి. అవినాభావసంబంధమైనదిగా వుండాలి. నీవు నామమును ఎట్టి భావముతో వుచ్చరిస్తున్నావో, అనుసరించేవారి భావములుకూడను అదే పవిత్రమైన స్థితిలో వుంటుండాలి. మన జీవితానికి మూలకారణముకూడను యోచించాలి. మనము ఎట్టి శబ్దమును వుచ్చరింతుమో అట్టి శబ్దతరంగములే వాయువునందు లీనమవుతాయి. అవియే ether అనే స్థానములో విద్యుత్ తరంగములుగా చేరిపోతాయి. మనిషి మరణించినా యీ శబ్దములు యేమాత్రము మార్పు చెందవు. ఇట్టి శాశ్వతమైన, నిత్యమైన, సత్యమైనవి యీ తరంగములు. ఈనాడు ఎక్కడ చూచినా దుశ్శబ్దములచేత నిండివుంటున్నాది వాతావరణము. కనుకనే దుర్భావములు అభివృద్ధియైపోతున్నాయి. దుర్భావములచేత దుశ్చేష్టలు అభివృద్ధి అవుతున్నాయి. మానవుడనగా కేవలము నడతలతోకూడిన స్వరూపము. నడతలు సరిగా వుంటున్నప్పుడే మానవత్వము సరిగా అభివృద్ధి గావిస్తూ వుంటుంది. కనుక, మనము యెట్టి శబ్దము గావింతుమో అట్టి తరంగములచేత జగత్తంతయు ప్రశాంతమైన రూపముగా తీర్చిదిద్దబడుతుంది.

**మన బుద్ధి మనము చేసిన కర్మలపై ఆధారపడి ఉంటుంది**

ఒక చక్కని ఉదాహరణము. మనము ఎట్టి మంట వేస్తామో, అట్టి పొగనే వస్తుంది. ఎట్టి పొగ వస్తుందో అట్టి మేఘములుగా రూపొందుతుంది. ఎట్టి మేఘములో అట్టి వర్షము కురుస్తుంది. ఎట్టి వర్షమో అట్టి పంట పండుతుంది. ఎట్టి పంటనో అట్టి వంట. ఎట్టి వంటనో అట్టి బుద్ధి. కనుక, మన బుద్ధి మనము చేసిన కర్మలపైన ఆధారపడివుంటుంది.

srisathyasaivachanamrutam

దీనిని బట్టియే 'బుద్ధిఃకర్మానుసారిణీ' అన్నారు. సత్కర్మలు మనము ఆచరించినప్పుడు, సద్భావములను చింతించినప్పుడు సత్ఫలితమే మనకు కనిపిస్తుంది. 'యద్భావం తద్భవతి'. మన భావములు పరిశుద్ధమైనవిగను, పవిత్రమైనవిగను అభివృద్ధి గావించుకోవాలి. ఈ నామోచ్చారణ చాలా దివ్యమైనది. ఈ నామముతో రూపమునుకూడను మరచవచ్చును. ఆనంద సన్నివేశములో మనము లీనము కావచ్చును. తనకు తానే తన్మయత్వుడు కావచ్చును. ఉన్మత్తులు కావచ్చును. మాధుర్యమైన తత్త్వమును అనుభవింపవచ్చును. ఇదియే 'సమాధిస్థితి' అన్నారు. ఇటువంటి సమాధిస్థితి మనకు లభించాలంటే దీనికి మూలము మనము చేసే కర్మలయందే వుంటున్నాది.

## భావరాగతాళ సమ్మిళితమైనదే భారతము

నామసంకీర్తన అనేది కేవలం యేదో ఒక భజనగా, కాలాన్ని సద్వినియోగముచేసే ప్రక్రియగా మనము భావించరాదు. వేలాది ప్రజలు చేరినప్పుడు అందరికీ అందుబాటులో, అనుకూలముగా, సరైన సులభమార్గములో వుండే నామాలను మాత్రమే మనము వుచ్చరించాలి. ఈ నామము పాడుతూ వుంటే తమకు తామే దేహములు చైతన్యములో ఉఝ్ఞాతలూగాలి. ఏదో నిద్రపోయే రీతిగా మనము స్లోగా పాడుతుంటే ఆ సమాజంకూడను తమోగుణములో మునిగిపోతుంది. భారతీయుల నామ సంకీర్తనం చాలా పవిత్రమైనది. 'భారతము' అంటే మీకనేక పర్యాయములు చెప్పాను. 'భా', 'ర', 'త' అనే మూడక్షరములతోకూడినది. 'భా' అనగా భావము. 'ర' అనగా రాగము. 'త' అనగా తాళము. భావరాగ తాళ సమ్మిళితమైనదే భారతము. భావముతో, నోటితో రాగముతో, తాళము వేస్తుంటే తమకు తామే తన్మయత్వులుగా మారిపోవాలి. అందరి హృదయములు ఒక్క చోటకూడి, అందరి వాక్కు ఒక్క శృతితో చేరి అందరి తాళములు ఒక్క లయగా పడినప్పుడు యెంత ఆనందముగా వుంటుంది! ఇదే నిజముగా చైతన్యస్వరూపము. మన యింద్రియములయొక్క ఆనందము, మనయొక్క రాగము, మనయొక్క స్వరమే మనము తీసుకుంటే యిది కేవలము స్వార్థముగా రూపొందుతుంది. కనుక, యీ మమత్వాన్ని దూరంచేయాలి. సర్వమానవత్వాన్ని ఏకం గావించాలి. ఈ విధమైన ఏకత్వముచేత

srisathyasaivachanamrutam

దివ్యత్వమును మనము అనుభవించవచ్చు. కనుక, యీ Unity గా చేసే సంకీర్తన మనం అభివృద్ధి గావించాలి. ఎక్కడ unity వుంటుందో అక్కడ purity వుంటుంది. ఎక్కడ purity వుండునో అక్కడ Divinity వచ్చి చేరిపోతుంది. కనుక, unity లేకపోతే purity యేమాత్రము సాధించలేము. ఆ unity యేమిటి? భావములో unity రాగములో unity తాళములో unity గా వుండాలి. ఇదే త్రికరణ శుద్ధి. ఈ త్రికరణ శుద్ధిచేతనే త్రిమూర్త్యాత్మక స్వరూపాన్ని మనము వశము చేసుకోవచ్చును. త్రికరణ శుద్ధి అన్ని విధములైన దివ్యత్వాన్నికూడను సాధించగలదు. కనుకనే

**త్రిగుణం త్రిదళాకారం త్రినేత్రంచ త్రియాయుధమ్**
**త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణమ్**

ఆ హృదయమనేది భగవదర్పితము గావించుకున్నప్పుడు యీ త్రిగుణములు, త్రికాలములు, త్రిలోకములుకూడను ఏకత్వంగా మారిపోతాయి.

**నామములో యేనాడు, ఎట్టి మార్పు వుండదు**

స్వార్థాన్ని త్యాగము చేయాలి. పరార్థమును ప్రవేశపెట్టాలి. మమత్వాన్ని త్యజించాలి. దివ్యత్వములో లీనంకావాలి. ఇదే నిజమైన నామ సంకీర్తన సారము. సామాజిక భజన అందరికీ సంబంధించినది, ఒక్క వ్యక్తికి మాత్రమే సంబంధించినది కాదు. ఈ విశాల భావమును మీరు దృష్టియందుంచుకొని సంకీర్తనలు చేయటానికి పూనుకోవాలి. నామ సంకీర్తన మాత్రమే ప్రధానంగా లక్ష్యంగా తీసుకోండి. గుణ సంకీర్తన యేదో కొన్ని విధములైన అనుమానములకు అవకాశమునందించవచ్చు. 'కరుణామయుడు' అని నామం మనం చెప్పవచ్చు. కొందరికి అందులో అనుమానం ప్రారంభం కావచ్చును. 'భగవంతుడు కరుణామయుడైనప్పుడు నా బాధలు ఎందుకు తీర్చటంలేదు, కరుణామయుడైనప్పుడు ఏ విధమైన మార్గములోనైనా కరుణయే ప్రవహించాలికదా! ఈ కరుణామయుడైన భగవంతుని హృదయంలో కాఠిన్యము ఎందుకు ప్రవేశించాల'ని, సందేహము కలుగవచ్చును. యీ గుణములయందు కొన్ని కొన్ని మార్పులు, కూర్పులు వుంటుంటాయి. లీలలుకూడను కొన్ని సమయ సందర్భములను అనుసరించి మార్పులు చెందుతూ వుంటాయి. వారి వారి స్థితి,



srisathyasaivachanamrutam

గతి, మతిని బట్టి లీలలు మారుతూ వుంటాయి. భావములుకూడను ఆ విధంగానే స్థితి, గతి, మతినిబట్టి మారుతూ వుంటాయి. ఇవి దేశకాల పరిస్థితుల ప్రభావాలకుకూడా గురి అవుతూ వుంటాయి. కాని, నామములో యేమాత్రము మార్పు వుండదు.

**భావము పరిశుద్ధముగా ఉంటే రాగ, తాళములు వాటంతట అవే చేరిపోతాయి**

నామతత్త్వాన్ని మనం హృదయమునందు ప్రతిష్ఠింపచేసుకొని నామికోసం ప్రాకులాడుతూ దివ్యమైన భావముతో యీ నామ సంకీర్తన గావించాలి. దీనినే 'సమ్యక్ కీర్తనం సంకీర్తనం', అన్నారు. మెత్తగా, freeగా, మనము ఆశించిన రీతిలో దీనిని సంకీర్తన గావించాలి. నా యొక్క గొంతు ఆ స్వరానికి సరిపోతుందా లేదా అనే దానిపై లక్ష్యము పెట్టకూడదు. తాళమునకు సరిగా కలుస్తుందా లేదా అని తాళముమీదకి మనసు పోనివ్వకూడదు. మన భావము శుద్ధిగా వుంటే రాగతాళములు రెండూ చక్కగా చేరిపోతాయి. మనస్సును divide చేసుకుంటే అక్కడ enimity ప్రారంభమౌతుంది. కనుక, యిక్కడ divide చేయకూడదు divine చెయ్యాలి. ఈ divide చేసినప్పుడు చాలావరకు మార్పు కలుగుతుంది. ఈ divide చేయకుండా వుండటానికి భావాన్ని విస్తృతపరచుకోవాలి. వస్త్రంలో అనేక దారములు చేరి వుంటున్నాయి. ఒక్కొక్క దానిని ప్రత్యేకంగా తీసుకున్నప్పుడు రెండు వేళ్లతో దానిని త్రుంచవచ్చు. కానీ, అన్ని దారాలు చేరినప్పుడు ఎంత భద్రంగా వుంటాయి! అదే విధంగా మన భావములు రాగముపైన, తాళముపైన, శృతిపైన, ఆడియన్సుపైన డివైడ్ చేస్తే నామ సంకీర్తన అన్ని విధాలా బలహీనమై పోతుంది.

నీ హృదయములోపల నామిని చిత్రించుకో. నామాన్ని ఉచ్చరించు. చిత్రించుకున్న నామిని, ఉచ్చరించే నామముతో చేర్చినప్పుడే ఆనందమనే ఉల్లాసము ఏర్పడుతుంది. నామ సంకీర్తన అందరి హృదయాల్ని మరిపించాలి, మురిపించాలి. కనుక మురిపించి, మరపించి, తరింప చేసేదే యీ సంకీర్తనము. ఇలాంటి సంకీర్తనచేత జగత్తంతయూకూడను పవిత్రమైన వాతావరణముతో నింపాలి. ఆ వాతావరణములోని గాలి ఎలాంటి వారు పీల్చుకున్నా వారి హృదయములో ఆనందం అభివృద్ధి కావాలి. అట్టి ఆనందమును ప్రవేశింపజేసి అందించేదే నామ సంకీర్తనం. అట్టి ఆనందమును



sri sathyasai vachanamrutam

అందించలేని భగవన్నామము ఎందులకు? అనగా ఏకత్వముతో కూడివుండాలి. అనేకత్వములోని యేకత్వమును నిరూపించాలి. కనుకనే

**నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం**
**ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్**
**ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం**
**భావాతీతం త్రిగుణరహితం....**

ఇలాంటి ఏకత్వాన్ని మురిపించేది, దేహాన్ని మరపించేది, జగత్తులో లీనమయ్యే నామాన్ని మనం సంకీర్తనం చేయుటకొరకు దీనికి యీనాడు 24 గంటలు 'అఖండ భజన' అని పేరు పెట్టారు. నిజానికి, యిది అఖండ భజనకాదు. ఇది ఖండభజనే! సామాజికముగా యిది ఖండభజనే అయినప్పటికిని మన జీవితములో అఖండ భజనగా రూపొందింపచేసుకోవాలి. దివ్యమైన ప్రపంచమంతా అగ్ని, సూర్య, చంద్రాదులతో నిండినది. ఈ అగ్ని సూర్య చంద్రాదుల బీజాక్షరమైనది, రామమంత్రము. అగ్ని పాపములను భస్మం చేస్తుంది, సూర్యుడు అజ్ఞానాంధకారము రూపుమాపుతాడు, చంద్రుని చల్లదనము తాపమును చల్లారుస్తుంది. కనుక, పాపము, అజ్ఞానము, తాపము దూరము గావించేది, రామనామము. మన జన్మకు మూలకారణమే తాపము, పాపము. ఈ రెండింటికి మూలకారణము అజ్ఞానము. కనుక అజ్ఞానము రూపుమాపాలంటే యీ సూర్యునియొక్క ప్రకాశము అత్యవసరము. బుద్ధిప్రకాశాన్ని మనం అభివృద్ధి గావించుకోవాలి. నామాన్ని ఆధారం చేసుకుని నామిని చేరే లక్ష్యంతో జీవితాన్ని సార్థకం గావించుకోవాలి. ఇలాంటి దివ్యమైన అర్థమును గుర్తించుకొని వర్తించటానికి ప్రయత్నించాలి.

**తనువు తరించే నిమిత్తమే!**

తరించే నిమిత్తమై తనువును ధరించామనే సత్యాన్ని గుర్తించాలి. తనువు శాశ్వతం కాకపోయినప్పటికి తరించటము మాత్రము సత్యము. ఏనాటికైనా మనము తరించక

srisathyasai vachanamrutam

తప్పదు, భగవంతుని వరించక తప్పదు, భ్రమను మనము విసర్జించక తప్పదు. ప్రపంచముయొక్క భ్రమను మర్చిపోవాలి. దేహ భ్రాంతి నశించి పోవాలి. ఆత్మతత్త్వము నిరంతరము ప్రకాశిస్తూ రావాలి. ఆత్మయే సత్యము. దేహము మృత్యువు. మనస్సు అజ్ఞానము. కనుకనే

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

అని అసత్యమునుండి సత్యానికి చేర్చమని, మృత్యువునుండి అమృతత్వానికి గొని పొమ్మని, చీకటినుండి వెలుతురులో ప్రవేశింపజేయమని మానవుడు కోరుతూ వుండేది. మానవుడు వదలవలసిన దానిని వదలాలి. తెలుసుకోవలసిన దానిని తెలుసుకోవాలి. చేరవలసిన గమ్యమును చేరాలి. అంతవరకు మనకు శాంతి లభించదు. మనము శాంతిని పొందాలంటే యీ మూడింటియొక్క రహస్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. కనుక యీనాడు నామ సంకీర్తన హృదయాన్ని కదిలించేదిగా, భగవంతుని కదిలించేదిగా వుండాలి. అందరూకూడను ఏకోన్ముఖులైపోయి భగవంతుని నామాన్ని ఉచ్చరించటానికి ప్రయత్నించండి.

**(తేదీ 8-11-1986న ప్రశాంతినిలయము మందిరంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam